సాక్షి
వికారాబాద్

శనివారం । 24 । జూన్ । 2023



ఆర్టీసీలో విలేజ్ ఆఫీసర్లు

వినూత్న కార్యక్రమాలతో ప్రయాణికులను ఆకర్షిస్తోంది ఆర్టీసీ. ఆఫర్లు అమలు చేస్తూ సంస్థను లాభాల్లోకి తెస్తోంది. 10లో▸



పాఠశాలలపై చర్యలు

ప్రైవేటు విద్యాలయాలపై ఎంఈఓ కొరడా ఝుళిపించారు. ఆకస్మిక సోదాలతో చర్యలు తీసుకున్నారు. 10లో▸



పంట మారుద్దాం..

ఒకే రకమైన పంట వేయడంతో దిగుబడి క్షీణిస్తుంది. దీని నివారణకు పంట మార్పిడి తప్పనిసరి. 11లో▸

న్యూస్‌రీల్

కస్తూర్బాలో కాంట్రాక్టు ఉద్యోగాలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్‌లోని స్పెషల్ ఆఫీసర్, పీజీసీఆర్‌టీ,సీఆర్‌టీ,పీఈటీ ఖాళీలను రాతపరీక్ష ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రాథమికంగా 61 ఖాళీలను గుర్తించినట్లు పేర్కొన్నారు. సబ్జెక్టుల వారీగా ఖాళీల సంఖ్యను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీల భర్తీకి కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్హులు, రాతపరీక్ష విధానం, సిలబస్, అభ్యర్థుల ఎంపిక విధానం తదితర వివరాలు సమగ్ర నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ rchooedu.teanfana.gov.inలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 26 నుంచి జూలై 5న సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆబ్జెక్టివ్, ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వివరాల కోసం పైవెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా కృష్ణంరాజు



కొడంగల్: కాంగ్రెస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజును పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. కొడంగల్‌కు చెందిన ఆయన పార్టీలో ఒక్కో మెట్టు ఎక్కుతూ జిల్లా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం కృష్ణంరాజు విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

తాత్కాలిక పద్ధతిన లెక్చరర్ పోస్టులు

కొడంగల్ రూరల్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే వెనకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన వివిధ సబ్జెక్టులు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్‌సీఓ యాదయ్యగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్, కామర్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించి ఆంగ్ల మాధ్యమంలో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఈనెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 30న ఉదయం 8:30 నుంచి సాయంత్రం 4:30 వరకు పరిగిలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీ ఉన్నవారు మాత్రమే అర్హులని తెలిపారు. వివరాలకు సెల్: 96181 35006, 91549 02280 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

డైట్ కాలేజీలో అధ్యాపక ఖాళీలు

వికారాబాద్ అర్బన్: జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో తాత్కాలిక పద్ధతిన అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.రామచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యాపకులకు రూ.18 వేలు, ఫిజికల్, ఆర్ట్స్ ఎడ్యుకేషన్ లెక్చరర్లకు రూ12 వేల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మొత్తం 14 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ చేసి ఉండాలని తెలిపారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు, బయోడేటాతో ఈనెల 30లోపు డైట్ కాలేజీలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఉపాధి రంగాలపై ఉచిత శిక్షణ

ధారూరు: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంత పురుషులకు బైక్ మెకానిక్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ టీవీ కెమెరా సర్వీసింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు భారతీయ స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ చిల్కూరు సంచాలకులు కె.రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, ఎస్సెస్సీ, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. జూలై 3నుంచి చిలుకూరులో శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈనెల 24నుంచి జూలై 2వరకు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు ఫోన్ :86390 79122, 9000778300లో సంప్రదించాలి.

మాటిస్తున్నా మహేంద్రా!



పార్టీలో సముచిత గౌరవం దక్కుతుంది

- వచ్చేది మనమే.. అటుఇటు వెళ్లి ఆగం కావొద్దు
- నీ సేవలు బీఆర్‌ఎస్‌కు చాలా అవసరం
- 'పట్నం'కు గులాబీ అధినాయకత్వం హామీ

వికారాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అధికార పార్టీకి గుడ్‌బై చెప్పనున్నారనే విషయం కొద్ది రోజులుగా జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడ చూసినా ఇదే అంశంపై జోరుగా చర్చ సాగింది. పట్నం తీరు సైతం ఈ అంశాలను బలపర్చేలా కనిపించడంతో పార్టీ మారుతారని చాలామంది డిసైడయ్యారు. కానీ వీరి అంచనాలను తలకిందులు చేస్తూ గురువారం శంకర్‌పల్లిలో నిర్వహించిన రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ పక్కనే కనిపించి అందరినీ ఆశ్చర్యపర్చారు. పార్టీలో తగిన గౌరవం కల్పిస్తామని బీఆర్‌ఎస్ అగ్రనేతలు ఆయనకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మూడోసారి అధికారంలోకి వచ్చేది మనమే.. అనవసర నిర్ణయాలు తీసుకుని ఆగం కావద్దని సూచించినట్లు తెలుస్తోంది.

గైర్హాజరుతో అనుమానాలు

పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే మహేందర్‌రెడ్డి ఇటీవల సైలెంట్ కావడం చర్చనీయాంశమైంది. ఇటీవల మహేశ్వరంలో నిర్వహించిన సీఎం మీటింగ్‌కు సైతం ఆయన హాజరు కాలేదు. ఎప్పుడూ ముఖ్యమంత్రి పక్కనే ఉండే ఆయన కనిపించకపోవడం ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్నారనే విషయం మీడియాలో ఫోకస్ కావడంతో బీఆర్‌ఎస్ అధిష్టానం అప్రమత్తమైంది. అతనితో సన్నిహితంగా ఉండే సెకండ్ క్యాడర్ నేతలతో పార్టీ ముఖ్యనేతలు సంప్రదింపులు జరిపారు. బీఆర్‌ఎస్ అగ్ర నాయకులు ఇద్దరు రంగంలోకి దిగి పట్నంను బుజ్జగించినట్లు తెలుస్తోంది.

కేసీఆర్, కేటీఆర్ చర్చలు

పట్నం దారెటు.. అనే విషయంలో తలెత్తిన చర్చ అధికార పార్టీని ఆలోచింపజేసింది. సీనియర్ నేత, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రాజకీయంగా మంచి పట్టున్న నాయకుడు కావడంతో ఆయనను వదులుకోవద్దని గులాబీ పార్టీ నిర్ణయించుకుంది. దీంతో నేరుగా రంగంలోకి దిగిన మంత్రి కేటీఆర్ బుధవారం రాత్రి ఆయనను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఇవి సఫలం కావడంతో మరుసటి రోజు శంకర్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమాల్లో మహేందర్‌రెడ్డి.. సీఎం వెంట ప్రత్యక్షమయ్యారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో నేరుగా చర్చలు జరిపిన గులాబీ బాస్ కేసీఆర్.. పట్నం అలక తీర్చినట్లు సమాచారం. ఆ వెంటనే రెట్టించిన ఉత్సాహంతో మహేందర్‌రెడ్డి తాండూరులోని తన మద్దతుదారులకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిసింది. ఈసారి కూడా బీఆర్‌ఎస్ తాండూరు టికెట్ మనకే వస్తుందని ధీమా వ్యక్తంచేసినట్లు వినికిడి.

సయోధ్య కుదిరిందా..?

బీఆర్‌ఎస్ అధిష్టానం చొరవతో.. మహేందర్‌రెడ్డి మనసు మార్చుకున్నారా..? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే కాంగ్రెస్‌తో టచ్‌లోకి వెళ్లటంతో పాటు పార్టీ మారేందుకు నిర్ణయించుకున్నారనే విషయం స్పష్టం కావడంతోనే.. పార్టీ నష్టపోతుందనే కారణంతో సీఎం కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి పట్నం మనసు మార్చినట్లు తెలుస్తోంది. అయితే ఇది తాత్కాలికమా.. ఫైనలా..? అనే విషయాపై మరి కొద్ది రోజుల్లో స్పష్టత రానుంది. ఇదిలా ఉండగా అలక పాన్పు వేసి అనుకున్నది సాధించుకున్న పట్నం తనను నమ్ముకుని.. మిగిలిన నియోజకవర్గాల్లో టికెట్లు ఆశిస్తున్న ఆయన మద్దతుదారులను ఏం చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



అసమ్మతి నేతల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి

ఆనంద్‌కు మద్దతివ్వం

- బీఆర్‌ఎస్ టికెట్ ఆయనకు వస్తే పనిచేసేది లేదు
- అసమ్మతి నేతల ప్రతిన
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ధారూరులో ప్రత్యేక సమావేశం
- మరోసారి బయటపడిన వర్గ విభేదాలు

ధారూరు: వచ్చే సాధారణ ఎన్నికల్లో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు బీఆర్‌ఎస్ వికారాబాద్ టికెట్ కేటాయిస్తే తాము పనిచేయబోమని అసమ్మతి నేతలు ప్రతినబూనారు. మండల కేంద్రం సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశం నిర్వహించారు. వికారాబాద్, ధారూరు, మర్పల్లి, బంట్వారం , కోట్‌పల్లి, మోమిన్‌పేట్ మండలాలకు చెందిన దాదాపు 200 మందికి పైగా నాయకులు, ప్రధాన కార్యకర్తలు సుదీర్ఘంగా చర్చించారు. మూడు నెలల క్రితం ఎమ్మెల్యే వ్యతిరేకులను తన వద్దకు పిలిపించుకున్న మంత్రి సబితారెడ్డి కొన్నాళ్ల పాటు ఓపిక పట్టాలని, పార్టీలో అసమ్మతి కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించడంతో మిన్నకుండిపోయారు. పరిస్థితిని చక్క దిద్దేందుకు తనకు మూడు నెలల గడువు ఇవ్వాలని చెప్పడంతో సరేనన్నారు. కానీ ఇప్పటి వరకు ఆనంద్ నుంచి ఎలాంటి సానుకూల వాతావరణం లేకకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకోవాలని అసంతృప్తులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా కొద్ది రోజులుగా అందరూ కలిసి దశాబ్ది వేడుకల్లో పాల్గొనడంతో.. పార్టీ నేతల్లో మార్పు వచ్చిందని అంతా భావించారు. కానీ తమ అసంతృప్తిని బయటకు కనిపించకుండా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారనే విషయం ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ బీఆర్‌ఎస్‌లో మళ్లీ ముసలం ప్రారంభమైందనే చర్చ వినిపిస్తోంది. అసమ్మతి వర్గంలోని వడ్ల నందు, రామేశ్వర్, భూమనోళ్ల కృష్ణయ్య వంటి వారిలో ఎవరికి అవకాశం వచ్చినా అంతా కలిసి మద్దతు ఇవ్వాలని అసమ్మతి వర్గీయులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కొద్ది నెలలుగా ప్రశాంతంగా ఉన్న అధికార పార్టీలో.. నేతల మధ్య కొనసాగుతున్న విభేదాలు మరోసారి బయటపడటం రాజకీయ దుమారం రేపుతోంది. ఇన్నాళ్ల పాటు నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు అసమ్మతి నేతల మీటింగ్‌తో మరోసారి తెరపైకి వచ్చాయి. ఈ సమావేశంలో జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుర్లపల్లి రమేశ్, ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు పట్లోళ్ల బసప్ప, బీఆర్‌ఎస్ నాయకులు మున్వర్‌షరీఫ్, వడ్ల నందు, బి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'గురునానక్' వద్ద పహారా



గురునానక్ కళాశాల వద్ద రక్షణగా ఉన్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం పోలీసులు పహారా కాస్తున్నారు. యూనివర్సిటీ పేరుతో మోసం చేశారని గురువారం కళాశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి నేతలు ఆందోళన చేయడం..ఉద్రిక్త పరిస్థితులు నెలకొని లాఠీచార్జి వరకు వెళ్లడం, అరెస్టులు చేయడం తెలిసిందే.ఈ నేపథ్యంలో మళ్లీ ఏమైన ఆందోళన కార్యక్రమాలు చోటు చేసుకుంటాయోనన్న ఉద్దేశంతో పోలీసు బలగాలను మోహరించారు.మరోవైపు యాజమాన్యం బౌన్సర్లను పెట్టుకోవడం గమనార్హం.

అండగా ఉంటాం


ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో మోసానికి గురైన విద్యార్థులు, పేరెంట్స్‌కు అండగా ఉంటామని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాల వద్ద గురువారం జరిగిన ఆందోళనలో అరెస్టై బెయిల్‌పై విడుదలైన ఆయన స్థానిక డాగ్ బంగ్లా వద్ద మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీ పేరుతో విద్యార్థులను కళాశాలలో చేర్చుకొని తీరా అనుమతి రాలేదంటూ మోసం చేసిన యాజమాన్యాన్ని 60 రోజులుగా ప్రశ్నిస్తున్నా, పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి విద్యార్థుల భవిష్యత్తుపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

ఇబ్రహీంపట్నం: యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని అరెస్టు చేయాల ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గురునానక్ కళాశాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తప్పు చేసిన యాజమాన్యాన్ని వదలిపెట్టి కన్నబిడ్డల భవిష్యత్తు కోసం ఆందోళనకు దిగిన తల్లిదండ్రులపై వారికి మద్దతుగా వచ్చిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌తోపాటు పలువురిపై లాఠీలు ఝుళిపించి అరెస్టులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వారం రోజుల్లో విద్యార్థులకు న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, మంఖాల దాసు, ఆకుల ఆనంద్‌కుమార్, రవీందర్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, సుబ్బూరి పాండు పాల్గొన్నారు.

వలస నేతల పక్క చూపు!

- అధికార పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకుల అసంతృప్తి
- తమకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఆవేదన
- పెద్ద నేతలే లబ్ధి పొందుతున్నారని కినుక



కొడంగల్: అధికార పార్టీలో కొనసాగుతున్న కొంతమంది వలస నేతలు పక్క చూపులు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో వీరి సంఖ్యే ఎక్కువగా ఉంది. నాలుగు నియోజకవర్గాల్లోనూ మొదటి నుంచి టీఆర్‌ఎస్‌లో ఉన్నవారు కొద్ది మందే. మిగిలిన వారంతా పరిస్థితుల ప్రభావంతో కాంగ్రెస్.. టీడీపీ నుంచి వలస వచ్చిన వారే. వీరంతా ప్రస్తుతం బీఆర్‌ఎస్‌లో ఉన్నప్పటికీ హస్తం వైపు చూస్తున్నారు. పలువురు నేతల పరిస్థితి తనువు గులాబీ తోటలో.. మనసు హస్తం గూటిలో అనే చందంగా మారింది. అధికార పార్టీలో కొనసాగుతున్న వారిలో పలువురి మనసు కాంగ్రెస్ వైపు లాగుతోందని ప్రచారం సాగుతోంది. బీఆర్‌ఎస్‌లో తమకు ప్రాధాన్యత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత ఆప్తులు సన్నిహితుల వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో అధికారం కొంత మంది నాయకుల చేతుల్లోనే కేంద్రీకృతమైందని బాహాటంగానే చెబుతున్నారు.

జోరందుకున్న రాజకీయ చర్చ

శాసన సభ ఎన్నికలకు కౌంట్ డౌన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు రాజకీయాల గురించి చర్చించుకుంటున్నారు. అన్ని వర్గాల్లో ఇదే టాపిక్ నడుస్తోంది. జిల్లాతో పాటు కొడంగల్ రాజకీయాలపై విశ్లేషణలు చేస్తున్నారు. ఈసారి కూడా విజయం తమదేనని బీఆర్‌ఎస్, గెలిచి చూపిస్తామని కాంగ్రెస్ నాయకులు ఎవరికివారే ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న నేతల్లో చాలా మంది తమకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఒకింత అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈసారి కూడా బీఆర్‌ఎస్ గెలిస్తే తమను పట్టించుకునే వారే ఉండరని, అందుకే కాంగ్రెస్ గెలవాలని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటు అధికారులు, అటు పోలీసులు తమ మాట వినడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పలువురు సర్పంచులు తమకు బిల్లులు రావడం లేదని ఆరోపిస్తున్నారు. తాము కూర్చునేందుకు కుర్చీ కూడా లేదని ఎంపీటీసీలు మండిపడుతున్నారు. జెడ్పీటీసీలది సైతం ఇదే వాదన. కింది స్థాయి నాయకులకు పనులు, పైరవీలు దొరకడం లేదు. వీరికి డబ్బులు వచ్చే దారులు లేకుండాపోయాయి. ఏవిషయంలోనైనా పెద్ద నాయకులే లాభపడుతున్నాయని లోలోన మధనపడుతున్నారు. ధరణి విషయంలో పలువురు రైతులకు ఇబ్బందులు ఉన్నాయని కాంగ్రెస్ వస్తే ధరణిని రద్దవుతుందని. ఏకకాలంలో రుణమాఫీ వర్తిస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే రైతులు తీసుకున్న పంట రుణాలు మోయలేని భారంగా మారాయి. బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతుబంధు డబ్బులు కూడా ఇవ్వడం లేదు. కందులు, వరి ధాన్యం, పత్తి అమ్మిన పైసలు సకాలంలో ఖాతాల్లో జమ కావడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వీటిని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

ఇరు పార్టీలకు సవాలే..

పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ అసెంబ్లీ బరిలో ఉంటానని ప్రకటించడం ఆ పార్టీ శ్రేణులకు మరింత బలం చేకూరింది. ఈ విషయంలో ఆయన సోదరుడు, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి మండలాల్లో తిరుగుతూ కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు. కొడంగల్‌లో రేవంత్ పోటీ చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఆయనకు నియోజకవర్గంలో కార్యకర్తలు మద్దతు నిండుగా ఉంది. ప్రతి రోజు నరేందర్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. గెలిచిన ఐదేళ్ల కాలంలో ఆయన ప్రతి గ్రామంలో తిరిగారు. ప్రజలతో నేరుగా పరిచయాలు పెంచుకున్నారు. బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత వచ్చినా నరేందర్‌రెడ్డికి ప్రజల అండ ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికలు ఇరు పార్టీల నేతలకు సవాలుగా మారనున్నాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు గెలుపు అంత సులువు కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

'పెట్టుబడి'కి.. రూ.322 కోట్లు రెడీ

- రైతుబంధు నగదు జమకు సర్వం సిద్ధం
- 26నుంచి 3వరకు రైతుల ఖాతాల్లోకి..
- జిల్లాలోని 2,88,834 మందికి లబ్ధి
- కొత్తగా 27,162 మందికి పథకం అమలు



వికారాబాద్ అర్బన్: పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమచేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పంటల సాగుకు రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో 2018 వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్విరామంగా అమలు చేస్తోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా కర్షకుల బ్యాంకు అకౌంట్లలో డబ్బులు జమచేస్తోంది. సీజన్లవారీగా సకాలంలో అందుతున్న డబ్బులతో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. ఎకరానికి రూ.5 వేల చొప్పున ఏటా రెండు సీజన్లలో వస్తున్న నగదుతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయిందని చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో డబ్బులు క్రెడిట్ కానున్నాయి. ఇందుకు సంబంధించిన విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం ఈ వివరాలను రెండు రోజుల క్రితమే వ్యవసాయ శాఖ అధికారులకు అందజేసింది.


వ్యవసాయ శాఖ ఏర్పాట్లు

జిల్లాలో రైతుబంధు పథకానికి 2,88,834 మందిని అర్హులుగా గుర్తించగా వీరికి రూ.322,12,25,993 విడుదల చేసింది. ఈనెల 18వ తేదీ నాటికి పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులకు కూడా పథకం వర్తించనుంది. ఈ డబ్బులు విడతల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. ఈమేరకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

కొత్తగా 27,162 వేల మంది

జిల్లాలో గత యాసంగి సీజన్‌లో 2,61,671 మంది రైతుబంధు పొందగా ప్రస్తుత వానాకాలంలో మరో 27,162 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందడంతో వీరు సైతం పథకానికి అర్హత సాధించారు. డబ్బులు జమ చేసే విషయంలో ముందుగా చిన్న, సన్నకారు రైతులకు తొలిప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆతర్వాత పెద్ద రైతులకు ఖాతాల్లో సొమ్ము జమవుతుంది. ఈ నెల 26 నుంచి జూలై 3వ తేదీలోపు దశలవారీగా అందరికీ డబ్బులు అందుతాయని అధికారులు చెబుతున్నారు.

26నుంచి డబ్బులు జమ



అర్హులైన రైతులందరికీ ఈనెల 26 నుంచి ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమవుతాయి. ఈసారి 21వేల పైచిలుకు మంది రైతులు కొత్త పాసుపుస్తకాలు పొందినట్లు సీసీఎల్‌ఏ నుంచి సమాచారం ఉంది. వీరిని కలుపుకొని జిల్లాలో 2లక్షల 88వేల పైచిలుకు రైతులు ఉన్నారు. రైతుబంధు విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే స్థానిక ఏఈఓలను కలిసి వివరాలు ఇవ్వాలి.

– గోపాల్, డీఏఓ

తెలంగాణలో కుటుంబపాలన

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

ఇబ్రహీంపట్నం: తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన అవినీతిమయంగా మారిందని, కుటుంబ పాలన కొనసాగుతోందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క్ యోజనలో భాగంగా మోర్చాలా సంయుక్త సమ్మేళనాన్ని శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన జోషి మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం అధికారాన్ని అడ్డం పెట్టుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేంద్రానికి చెల్లించే టాక్స్‌ల కంటే రెట్టింపు నిధులను తెలంగాణకు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మనిషికి 5 కిలోల చొప్పున సబ్సిడీ బియ్యం కేంద్రం ఇస్తున్న సంగతి ఇక్కడి సామాన్య ప్రజలకు తెలియదన్నారు. రోడ్లకు వేలాది కోట్లు ఇచ్చామని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్, రైతులకు సబ్సిడీపై ఎరువులతోపాటు పలు సంక్షేమ పథకాలను కేంద్రం ప్రజలకు అందజేస్తుందన్నారు. ఈ విషయాన్ని బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని జాగృతం చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఒకే నాణేం లాంటివన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చేందుకే కాంగ్రెస్ చూస్తుందన్నారు. 2014, 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్ గూటికి చేరిన అంశాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పనులను వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

క్లుప్తంగా

పార్కుల అభివృద్ధికి నిధులు



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్

వికారాబాద్ అర్బన్: మున్సిపాలిటీలోని ప్రతి పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. శుక్రవారం 6వ వార్డు సూర్యప్రకాష్‌నగర్‌లో రూ.4.80లక్షలతో పార్కు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రగతి నిధుల నుంచి పార్కు అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు. దశలవారీగా పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చందర్ నాయక్, మేనేజర్ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం రిమాండ్

మోమిన్‌పేట: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన హెచ్‌ఎం ప్రభును గురువారం సాయంత్రం రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపారు. ఈ నెల 19న పాఠశాల కార్యాలయంలో శుభ్రం చేయాలని బాధిత విద్యార్థినికి ఆయన సూచించారు. శుభ్రం చేస్తుండగా.. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నించాడని బాలిక తల్లి ఈ నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, హెడ్‌మాస్టర్‌ను రిమాండుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

రెండో వారంలో బస్‌పాస్ కౌంటర్

కుల్కచర్ల: విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు కుల్కచర్ల బస్టాండ్‌లో ప్రతి నెల రెండో వారంలో బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ పవిత్ర, కంట్రోలర్ ప్రసాద్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, ఆర్టీసీ బస్ పాస్‌లు కావాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సొప్ప గడ్డి కోస్తూ..

ఇబ్రహీంపట్నం: సొప్ప గడ్డి కోస్తూ ప్రమాదానికి గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మారయ్య కథనం ప్రకారం.. స్థానిక యాదవ బస్తీలోఉండే ఐలమ్మ(34) శుక్రవారం పశువుల కోసం యంత్రం ద్వారా సొప్ప గడ్డి కోస్తోంది. ప్రమాదవశాత్తు ఆమె చీర కొంగు మిషన్‌లో చిక్కుకొని మృత్యువాత పడినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఇంటిముందు నిలిపిన స్కూటీ మాయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన స్కూటీ మాయమైన సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో నివాసం ఉండే జ్ఞానేందర్‌రెడ్డి తన స్కూటీని (టీఎస్ 08సీఎస్ టీఆర్9194) ఇంటి ముందు రాత్రి పదిగంటల సమయంలో నిలిపి ఉంచాడు. పొద్దున లేచి చూసే సరికి కనిపించలేదు. శుక్రవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గురునానక్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

ఇబ్రహీంపట్నం రూరల్: గురునానక్ కళాశాల గుర్తింపు రద్దు చేసి, విద్యార్థులు నష్టపోకుండా జేఎన్‌టీయూకు అటాచ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురునానక్ కళాశాలకు యూనివర్సిటీ గుర్తింపు రాకపోయినప్పటికీ కళాశాలలో విద్యార్థులను చేర్చుకొని వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోకుండా జేఎన్‌టీయూకు అటాచ్ చేసి పరీక్షలు రాయించాలన్నారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకున్నందుకు కళాశాల గుర్తింపు రద్దు చేయాలని కోరారు.

ఆర్టీసీలో విలేజ్ ఆఫీసర్లు

- రవాణా సేవలను వివరించేందుకు ప్రత్యేకంగా నియామకం
- డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి బాధ్యతల అప్పగింత
- సంస్థను లాభాల్లోకి తెచ్చేందుకు ఉన్నతాధికారుల ప్రయత్నం



వికారాబాద్‌లో విలేజ్ బస్ ఆఫీసర్లతో ఆర్టీసీ అధికారులు

అనంతగిరి: తెలంగాణ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలతో ప్రయాణికులను ఆకర్షిస్తోంది. పలు పథకాలు, ఆఫర్లు అమలు చేస్తూ సంస్థను ఆదాయ మార్గంలో నడిచేలా తగిన చర్యలు తీసుకుంటోంది. సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు చేపట్టిన అనంతరం అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆర్టీసీ విలేజ్ బస్ ఆఫీసర్లు అనే సరికొత్త కార్యక్రమంతో ముందుకు వస్తున్నారు. విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమించిన బడిన వారు గ్రామాల్లో పర్యటిస్తూ ఆర్టీసీ చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరిస్తారు. రాయితీలు, ఆఫర్లపై అవగాహన కల్పిస్తారు. వివాహాది శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల సందర్శన, విహార యాత్రలు వంటి కార్యక్రమాలకు ఆర్టీసీ సేవలను వినియోగించుకునేలా చైతన్యం చేస్తారు. అవసరమైతే గ్రామాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. ప్రజల నుంచి వచ్చే వినతులను సైతం స్వీకరించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. విలేజ్ బస్ ఆఫీసర్ల ద్వారా ప్రయాణికులను ఎలాంటి సేవలు అందించగలుగుతున్నామో వివరిస్తారు. ఈ అంశాలపై వీరికి శిక్షణ సైతం పూర్తి చేశారు.

లాభాల బాటలో..

వికారాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 3 డిపోలు ఉన్నాయి. ఇందులో వికారాబాద్‌లో 69, పరిగి 80, తాండూరులో 89 బస్సులు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఆర్టీసీ లాభాల్లోనే ఉందని అధికారులు చెబుతున్నారు. మూడు డిపోల పరిధిలో మొత్తం 76మందిని విలేజ్ ఆఫీసర్లుగా నియమించారు. వీరిలో ఆయా డిపోలకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని విలేజ్ ఆఫీసర్లుగా నియమించారు. పెద్ద గ్రామాలకు ఒక్కరిని, చిన్నగ్రామాలైతే 2నుంచి 5 ఊళ్లకు ఒకరిని కేటాయించారు.

విలేజ్ అధికారి విధులు

- ఆర్టీసీని ప్రజలకు చేరువ చేయడమే వీరి ప్రధాన కర్తవ్యం.
- ఈ అంశాలపై ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.
- అందరికీ ప్రత్యేకమైన టీషర్టులు, ఐడీకార్డులు, బ్యాగులు అందజేశారు.
- గ్రామాల్లోని నోటీస్ బోర్డులో సదరు అధికారి పేరు, ఫోన్ నంబర్ పొందుపరుస్తారు.
- ప్రతీ 10నుంచి 15 రోజులకు ఒకసారి గ్రామానికి వెళ్లి సర్పంచ్, అధికారులు, సాధారణ ప్రజలతో కలిసి సమావేశం ఏర్పాటు చేయాలి.
- ఆర్టీసీ ప్రాధాన్యతను వివరిస్తూ సేవలను తెలియజేయాలి.
- ప్రయాణికుల సౌకర్యార్థం సంస్థ కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తారు.
- బస్సుల రాకపోకల సమయాలు అనుకూలంగా ఉన్నాయా..? లేవా, బస్సులు గ్రామానికి రావాలంటే ప్రజలు ఎలాంటి సహకారం అందించాలి తదితర అంశాలపై చర్చిస్తారు.
- శుభకార్యాలు, ఆర్టీసీ రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

ప్రజలకు చేరువయ్యేలా..



సరికొత్త విధానాలతో ప్రజలకు చేరువయ్యేలా ఆర్టీసీ కృషి చేస్తుంది. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, సబ్సిడీలు, ఆఫర్లను విలేజ్ ఆఫీసర్లు గ్రామాల్లో అవగాహన కల్పిస్తారు. సంస్థ ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషిస్తారు. ప్రతిఒక్కరూ ఆర్టీసీని ఆదరించాలి.

\- రాజు, వికారాబాద్ డీఎం

బైక్‌ను ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్

వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ద్విచక్రవాహనదారుడు

యాలాల: వేగంగా వస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన యాలాల మండలం రసూల్‌పూర్‌లో శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన భీమేష్‌కుమార్ ద్విచక్రవాహనంపై ప్రతిభ పాఠశాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్.. బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో భీమేష్ కాలుకు బలమైన గాయమైంది. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ప్రైవేటు వాహనంలో తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి పీఎస్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్



నాగవరం తండాలో సమావేశంలో మాట్లాడుతున్న స్వరూప

బంట్వారం: కాంగ్రెస్ బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, రానున్న ఎన్నికల్లో వికారాబాద్ గడ్డపై ప్రసాద్‌కుమార్ గెలుపు తథ్యమని ఆ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు స్వరూప ఆశాభావం వ్యక్తం చేశారు. ×మా నాన్నను దీవించండి× అనే నినాదంతో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య చేతన్ శుక్రవారం బంట్వారం మండలం నాగవరం తండాలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలను పలకరించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వరూప మాట్లాడారు. ప్రసాద్‌కుమార్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్పా నియోజకవర్గంలో కొత్తగా ఏమీ లేదన్నారు. అప్పట్లో వేసిన రోడ్లపై ఇప్పటి పాలకులు తట్టెడు మట్టి కూడా వేయలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ మాయ మాటలకు మరో సారి మోసపోవద్దంటూ ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, జెడ్పీటీసీ సంతోష, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, వికారాబాద్, బంట్వారం కోఆప్షన్ సభ్యులు ఎర్రవల్లి జాఫర్, తౌఫిక్. సీనియర్ నాయకులు నర్సింహులు, పురుషోత్తంరెడ్డి, మోహన్‌రెడ్డి, వీరేశం, శాకం నర్సింహులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు అజీమ్, గౌస్, మున్నాబాయ్, సలీం తదితరులు పాల్గొన్నారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

వికారాబాద్ అర్బన్: ఒలంపిక్ డేను పట్టణంలో ఘనంగా జరిపారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి వరకు జరిగిన ఈ రన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, సీఐ శ్రీనివాస్, కన్వీనర్ వినోద్, కమిటీ సభ్యులు ప్రతాప్ రెడ్డి, నర్సింహులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

హుడాకాంప్లెక్స్: ఆత్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని కరాటే లెజెండ్, సినీ నటుడు సుమన్ అన్నారు. సరూర్‌నగర్‌లోని జేఎస్‌ఏఎస్ అకాడమీలో శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డీ.కార్తిక్, సాయి హర్షిత్, పి.సుశాంత్‌కు శుక్రవారం బ్లాక్ బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సినీ నటుడు సుమన్

కాల్వలో పడిపోయిన లారీ

గంటల తరబడి నిలిచిపోయిన రాకపోకలు



కాల్వ నీటిలో లారీ

ఇబ్రహీంపట్నం రూరల్: త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అధిక బరువుతో వచ్చిన వరి ధాన్యం లారీ ఉప్పరిగూడ సమీపంలో రాచకాల్వలో పడిపోయింది. డ్రైవర్, క్లీనర్ ఎలాంటి ప్రమాదం లేకుండా బయటపడ్డారు. ఉప్పరిగూడ గ్రామానికి గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. ధాన్యం గంగపాలైంది. గత సంవత్సరం విస్తరంగా కురిసిన వర్షాలకు ఇప్పటికీ కాల్వలో నీరు అలాగే నిలిచి ఉంది. వంతెన కుంగిపోయి పూర్తిగా ధ్వంసమైంది. బ్రిడ్జి వేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేసినప్పటికీ సీసీ రోడ్డుతో సరిపెడుతున్నారని, ఇప్పటికైనా బ్రిడ్జి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్మిషన్ లేని పాఠశాలలపై చర్యలు

- విద్యాలయాల్లో దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు విక్రయించరాదు
- యాజమాన్యాలకు ఎంఈఓ హరిశ్చందర్ ఆదేశాలు
- పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేసిన విద్యాధికారి



లిటిల్ బడ్డీ స్కూల్‌ను మూసి వేయాలని యాజమాన్యానికి సూచిస్తున్న విద్యాధికారి హరిశ్చందర్

పరిగి: ప్రైవేటు విద్యాలయాలపై మండల విద్యాధికారి కొరడా ఝుళిపించారు. అకాస్మాత్తుగా సోదాలు నిర్వహించి అనుమతి లేని, పుస్తకాలు, బ్యాగులు విక్రయించిన పాఠశాలలు మూసి వేయాలని ఆదేశించారు. వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం పట్టణ కేంద్రంలోని పలు ప్రైవేటు పాఠశాలలను మండల విద్యాధికారి హరిశ్చందర్ తనిఖీ చేశారు. న్యూబ్రిలియంట్ టెక్నో స్కూల్‌లో పాఠ్యపుస్తకాలు ఉండటంతో గదిని సీజ్ చేశారు. లిటిల్ బడ్డీ స్కూల్‌కు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వెంటనే మూసి వేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో ఎలాంటి వాణిజ్యపరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, స్కూల్ బ్యాగ్స్ ఏ వస్తువులు అమ్మినా పాఠశాల పర్మిషన్ రద్దు చేస్తామని చెప్పారు. ఫీజులు ఎక్కువ వసూలు చేయరాదని, విద్యాహక్కు చట్టం ప్రకారం గతేడాది వసూలు చేసిన విధంగానే.. ఇప్పుడు తీసుకోవాలని సూచించారు.

రాతపూర్వకంగా..

గతేడాది కంటే ఇప్పుడు ఎవరైనా అధిక ఫీజులు వసూలు చేసినట్లయితే.. విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు అండర్ టేకింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలని, బడిలో ఎలాంటి పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు విక్రయించమని రాతపూర్వకంగా రెండు రోజుల్లో మండల విద్యావనరుల కేంద్రంలో ఇవ్వాలని హెచ్చరించారు. ఇప్పటికే రెండు పాఠశాలల్లో దుస్తులు, పాఠ్యపుస్తకాలు విక్రయించినట్లు తెలిసిందని, వాటిని సీజ్ చేశామని, త్వరలో మళ్లీ సోదాలు చేస్తామని చెప్పారు.

'అల్లూరి' చరిత్రను భావితరాలకు చెప్పాలి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి

మాదాపూర్: అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతాలను అభివృద్ధి చేసుకోవాలని, ఆయన చరిత్రను భావితరాలకు తెలియజెప్పాలని కేంద్ర సాంస్కృతిక శాఖమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్టీలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 125వ జన్మదినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో భాగంగా సన్నాహక సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం, క్షత్రియ సేవా సమితితో కలిసి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం నుంచి అల్లూరిసీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు సమితి సభ్యులను అభినందించారు. ఢిల్లీలోనూ జయంతి ఉత్సవాలు నిర్వహించాలనుందన్నారు. నటుడు కృష్ణ అల్లూరి సీతారామరాజు సినిమాను తీయకపోతే తనలాంటి వారికి ఆయన గొప్పతనం తెలిసేది కాదన్నారు. తన జీవితంలో ఎక్కువ సార్లు అల్లూరి సీతారామరాజు సినిమా చూసినట్లు తెలిపారు. ఆ పేరులోనే త్యాగం, స్ఫూర్తి, సాహసం ఉన్నాయన్నారు. భావితరాలకు కూడా ఆయన గొప్పతనాన్ని తెలియజెప్పేలా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. గిరిజనులను సంఘటితం చేసిన అల్లూరికి దక్కుతుందని, ఆయన పోరాట వీరుడే కాక ఆధ్యాత్మిక వేత్తగా పేర్కొన్నారు. గిరిజనుల జీవితాల్లో అనేక మార్పులను తీసుకువచ్చారన్నారు. మంచి, చెడు వివరించి వారిని సంఘటితం చేశారన్నారు. పోరాటాల్లోనూ నైతిక విలువలు పాటించారని, చెప్పి మరీ దాడి చేసి ఆయుధాలను తీసుకెళ్లే వారన్నారు. అల్లూరి సీతారామరాజు పై కార్టూన్ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమానికి దేశప్రధాని మోదీ, ముగింపు కార్యక్రమాలకు భారత రాష్ట్రపతి ద్రౌపతీ ముర్ము హాజరుకానుండటం సంతోషకరమన్నారు. ఏ గిరిజనుల కోసం ఆయన పోరాటం చేశాడో అదే గిరిజన మహిళ నేడు దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్నారని, ఆయన జయంతి ఉత్సవాలకు హైదరాబాద్ రావడం గర్వకారణమన్నారు. అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సినీనటుడు మురళీమోహన్‌లతో పాటు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆంజనేయులు



ఆమనగల్లు: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైం కంట్రోల్ బ్యూరో(ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన డి. ఆంజనేయులును నియమించారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీసీబీ జాతీయ అధ్యక్షుడు రణధీర్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రణధీర్‌కుమార్‌కు ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టు భర్తీకి మోక్షమెన్నడో?

- బొంపల్లిలో ఏళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టు
- నేతల జోక్యంతో ఆగిపోయిన పూరింపు ప్రక్రియ



బొంపల్లి అంగన్ వాడీ కార్యాలయం

దోమ: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఒక్కో కేంద్రంలో టీచర్‌తో పాటు ఆయాలను ప్రభుత్వం నియమించింది. కానీ ఏళ్ల తరబడి కొన్ని సెంటర్లలో టీచర్లు, ఆయాలు లేని కారణంగా లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం అందడం లేదు. ఇటీవల ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేసినప్పటికీ రాజకీయ నేతల ఒత్తిడితో అధికారులు వాటిని భర్తీ చేయలేకపోయారు.

నోటిఫికేషన్ వచ్చినా..

దోమ మండలంలో 42 అంగన్‌వాడీ కేంద్రాలు, 21 మినీ అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో బొంపల్లి అంగన్‌వాడీలో టీచర్ పోస్టుతో పాటు దిర్సంపల్లి, బ్రాహ్మణపల్లిలో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఇటీవల ప్రభుత్వం అంగన్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయినా బొంపల్లి టీచర్ పోస్టుతో పాటు దిర్సంపల్లి, బ్రాహ్మణపల్లి ఆయాల పోస్టును భర్తీ చేయడంలో అధికారులు విఫలం అయ్యారు. బొంపల్లిలో ఏళ్ల తరబడి టీచర్ పోస్టు ఖాళీగా ఉండడంతో బాస్‌పల్లి సెంటర్లో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచరే ఇక్కడ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

రాజకీయ ఒత్తిడే కారణం?

బొంపల్లి అంగన్ వాడీ టీచర్ పోస్టు భర్తీ విషయంలో రాజకీయ నాయకుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది. గ్రామంలోని అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతల మధ్య అంతర్గత వార్ వలనే పోస్టు భర్తీ కావడం లేదని చర్చ జరుగుతోంది. తమకు సంబంధించిన వ్యక్తికే పోస్టు కావాలంటూ ఇద్దరు నేతలు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసుకున్నట్లు సమాచారం. దీంతో సంబంధిత అధికారులు ఇద్దరు నేతలకు సంబంధించిన అభ్యర్థులు అర్హులు కాగా.. పోస్టు భర్తీని నిలుపుదల చేయాలంటూ జిల్లా అధికారులు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాజకీయ నాయకుల మనుగడ కోసం అంగన్వాడీ పోస్టు భర్తీ కాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

కొత్త నోటిఫికేషన్ వేస్తాం



బొంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రస్తుతం ఇన్‌చార్జి టీచర్ కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో వేసిన నోటిఫికేషన్‌కు ఇద్దరు అభ్యర్థులు సెలక్ట్ కాగా.. నేతల జోక్యంతో అది ఆగిపోయింది. టీచర్ పోస్టు భర్తీకి త్వరలో నోటిఫికేషన్ వేస్తాం.

\- ప్రియదర్శిని, సీడీపీఓ, పరిగి

ఊరెళ్లి వచ్చేసరికి ఊడ్చుకెళ్లారు



పగిలి ఉన్న ఇంటి గొళ్లెం

మీర్‌పేట: ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. బడంగ్‌పేట వెంకటాద్రి నివాస్‌కు చెందిన ఎస్. వెంకటప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ నెల 21న పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామానికి వెళ్లి 22న సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి బీరువా తెరిచి చూడగా 12 తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి, రూ.15 వేల నగదు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల కోసమే న్యాయసలహా కేంద్రం

ఆమనగల్లు: రైతులు తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికే వ్యవసాయ న్యాయ సేవా సలహా కేంద్రాన్ని ప్రారంభించినట్లు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. ఈ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదిక భవనంలోని వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలకు సంబంధించి వచ్చిన పది పిటిషన్లను స్వీకరించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో జడ్జి ఇందిర మాట్లాడుతూ.. రైతులకు న్యాయపరమైన సమస్యలుంటే పరిష్కరించుకోవడానికి సేవా కేంద్రం ఉపయోగపడుతుందని చెప్పారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులకు సంబంధించి రసీదులు విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నిట్టె నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుజాత, తహసీల్దార్ జ్యోతి, ఎస్‌ఐ సుందరయ్య, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, మార్కెట్ కార్యదర్శి సరోజ, ఏపీఎం వెంకట్‌రెడ్డి, ఏఈఓలు రాణి, నిఖిత, శివతేజ, సాయిరాం, బాల్‌రెడ్డి, శ్రీలత పాల్గొన్నారు.